క్లుప్తంగా

వెదురు సాగు లాభదాయకం



వెదురు మొక్కలు నాటుతున్న విద్యార్థులు

పెనుకొండ: వెదురు సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జయప్ప పేర్కొన్నారు. పట్టణంలోని కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్1–2 ఆధ్వర్యంలో విద్యార్థులు వెదురు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వెదురు సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. తక్కువ నీటితో సులువుగా పెరుగుతుందని, ఆక్సిజన్ ఉత్పత్తి చేసి వాతావరణంలోని కార్బన్‌డైయాక్సైడ్‌ను ఎక్కువ మొత్తంలో స్వీకరిస్తుందని తెలిపారు. అధ్యాపకులు ప్రతాప్, హరిప్రసాద్, హరీష్‌బాబు, యశోదా రాణి, చంద్రమోహన్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

పావగడ: తాలూకా వ్యాప్తంగా ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో జ్ఞాన సముపార్జన కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన డిజిటల్ గ్రంథాలయం, ప్రజా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని రొప్పం ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం రామాంజనేయ విద్యార్థులకు సూచించారు.గురువారం అభియాన కార్యక్రమంలో భాగంగా రొప్పంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు జయమ్మ మాట్లాడారు.

తల్లిదండ్రుల తర్వాత గురువే దైవం



రొళ్లలో ఎంఈఓ శ్రీధర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రొళ్ల: తల్లిదండ్రుల తర్వాత గురువే దైవం అని ఎంఈఓ శ్రీధర్, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యంజారప్ప తదితరులు తెలిపారు. గురువారం స్థానిక లక్ష్మీనరసింహస్వామి కమ్యూనిటీ భవనం ఆవరణలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు,ఎంఈఓ

అగళి: మండల పరిధిలోని మధూడి గ్రామం మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కమలమ్మ, లాల్‌పీరా, షాన్ బాషా వలీని గురువారం సన్మానించారు. ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. కార్యక్రమం ఎంఈఓ కృష్ణమూర్తిరాజు, ప్రధానోపాధ్యాయులు దాసేగౌడ్, పవన్‌కుమార్ రంగప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయులకు సన్మానం



వలస ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

అమరాపురం: మండలంలోని వలస మరియు హాలుకూరు గ్రామ సమీపంలోని మోడల్ పాఠశాలలో గురువారం ముందుగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆటల పోటీలో విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువా పూలమాలలతో పాటు మెమెంటోలు అందజేసి సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన కోరారు.



వినాయక నిమజ్జనం సందర్భంగా హిందూపురంలో బాణాసంచా వెలుగులు



నిమజ్జనానికి తరలివెళ్తున్న భారీ వినాయకుడు

గణపతి బొప్పా మోరియా..



నిమజ్జనానికి తరలివెళ్తున్న భారీ గణనాథుడు



వేలాదిగా శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



నిమజ్జనంలో మహిళలు, యువతల జోరు



29వ వార్డు ముక్కిడిపేటలో కూల్‌డ్రింక్‌లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ రోషన్ అలీ



అయ్యప్పస్వామి ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం



నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడు

హిందూపురం/హిందూపురం టౌన్: గణపతి బొప్పా మోరియా అంటూ హిందూపురం వీధులు హోరెత్తాయి. హిందూపురంలో వినాయక నిమజ్జనం సందర్భంగా గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి పొద్దుపోయేదాకా శోభాయాత్ర సాగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టిన అనంతరం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. విద్యుత్ దీపాలంకరణ, డీజే లైట్ల వెలుగులతో శోభాయాత్ర ముందుకు సాగింది. ప్రధాన వీధులతో పాటూ నిమజ్జన ప్రదేశం గుడ్డం కోనేరు ప్రాంతంలో భారీగా జనసందోహం నెలకొంది. వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు. కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు. పోలీసుల బందోబస్తు నడుమ ప్రశాంతయుత వాతావరణంలో గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. త్యాగరాజు నగర్‌లో టపాసులు పేల్చడంతో నిప్పుకణికలు టెంకాయ చెట్టుపై పడి నిప్పంటుకోవడంతో ప్రజలు భయభ్రాంతులకు లోనయ్యారు.

జోరుగా సేవా కార్యక్రమాలు

వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని హిందూపురంలో పలువురు సేవా కార్యక్రమాలను చేపట్టారు. జిల్లాతో పాటు సమీపంలోని కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు పట్టణంలోని వినాయక నిమజ్జనాన్ని చూడటానికి వచ్చారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్నదానాలు, నీళ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. పట్టణంలోని బీపీఎల్ షోరూమ్ వద్ద లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానంద్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అలాగే నంది సర్కిల్‌లో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఎన్.సత్యనారాయణ, లలితమ్మల సౌజన్యంతో ఆలయ గురుస్వామి బాలాజీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. బీఎస్టీ పెట్రోల్ బంక్ వారి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అలాగే అక్షయపాత్ర ఆధ్వర్యంలో మెయిన్ బజార్‌లో అన్నదానం చేశారు. పలు చోట్ల నీళ్లు, మజ్జిగను అందించారు.

ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో..

నిమజ్జనం సందర్భంగా ముస్లిం మైనార్టీ నాయకులు అన్నదానాలు, పానీయాలు పంపిణీ చేపట్టి సోదర భావం చాటిచెప్పారు. ముక్కిడిపేటలో 29వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ రోషన్ అలీ మైనార్టీ పెద్దలతో కలిసి చల్లటి పానీయాలు పంపిణీ చేశారు. అలాగే 7వ వార్డులో మహబూబ్‌బాషా అన్నదానం నిర్వహించారు. అలాగే అజ్మాతుల్లా ఖాన్, మైనార్టీ నాయకులు అన్నదానాలు చేశారు. ఇక మెయిన్‌బజారు, బోయపేట, ఆర్టీసీ బస్టాండ్, మార్కెట్ ఏరియా తదితర ప్రాంతాల్లో కూడా వినాయక ఊరేగింపులో పాల్గొన్న వారికి, ప్రజలకు అన్నదానం చేశారు.

ఘనంగా గణనాథుల నిమజ్జనం

అమరాపురం: మండల కేంద్రంలోని ఆర్డీటీ కాలనీ, ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుల నిమజ్జనం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయా కాలనీలో భక్తులు గణనాథులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో కూర్చోబెట్టి ప్రత్యేక అలంకరణ పూజలు అనంతరం గ్రామ వీధుల గుండా ఊరేగించారు. స్థానిక చెరువులో గణనాథులను నిమజ్జనం చేశారు. యువతీ యువకులు డీజే పాటలకు నృత్య ప్రదర్శన ఎంతగానో భక్తులను ఆకట్టుకుంది.

అగళిలో...



నిమర్జనానికి తీసుకెళుతున్న దృశ్యం

అగళి: వినాయక చవితి పండుగను పురస్కరించుకొని వినాయకుని మండల కేంద్రం, తదితర గ్రామంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను గురువారం ప్రజలు అట్టహాసంగా నిమజ్జనానికి తరలించారు. ప్రతి గ్రామంలోనూ ఊరేగింపు అనంతరం వినాయక ప్రతిమలను స్థానిక చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. ఎస్ఐ వీరేష, సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

పావగడలో..



నిమజ్జనానికి వెళ్తున్న మూషిక వాహనుడు

పావగడ: పట్టణంలో వినాయక నిమజ్జన వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. పలు వార్డుల నుంచి పెద్ద ఎత్తున ఊరేగింపుగా వినాయక ప్రతిమలను నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతీ యువకులు తప్పెట్ల మోతలకు ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

11న మండల సమావేశం

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో ఈనెల 11న సాధారణ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు హాజరు కానున్నట్లు తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు తప్పక హాజరు కావాలన్నారు.

సాక్షిపై కక్ష సాధింపు చర్యలు తగవు

- మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిర: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చినప్పటి నుంచి మీడియా స్వేచ్ఛకు భంగం వాటిల్లిందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 'సాక్షి' మీడియాపై కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. డీఎస్పీ ప్రమోషన్లలో అవినీతి, అక్రమాలు జరిగాయని 'సాక్షి'లో కథనం ప్రచురితమైతే.. పోలీసులు రాత్రి వేళలో పత్రికా కార్యాలయంలోకి వెళ్లి సోదాలు చేయడం మీడియా స్వేచ్ఛను హరించడమేనన్నారు. ఎడిటర్ ధనుంజయ రెడ్డిపై కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయించి, వేధించడం అన్యాయమన్నారు. మీడియా స్వేచ్ఛను హరించే కూటమి ప్రభుత్వం మనుగడ సాధించలేదన్నారు. పోలీసులు కూడా మీడియా జోలికి వెళ్లి ఇబ్బందులు తెచ్చుకోవద్దని హితవు పలికారు. మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించడాన్ని కూటమి ప్రభుత్వం మానుకోవాలని, లేకపోతే ప్రజలు కూడా ఎదురు తిరిగే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఎడిటర్ ధనుంజయరెడ్డిపై నమోదు చేసిన అన్ని కేసులను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

మడకశిరరూరల్: మండలానికి చెందిన నలుగురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. బుళ్లసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న కే విశ్వనాథ్, అదే పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న పి.వెంకటేశ్వరప్రసాద్, ఛత్రం ఎంపీయూపీ పాఠశాలల్లో ఎస్‌జీటీగా పని చేస్తున్న కేఎస్ రమేష్, గౌడనహళ్లి ఉన్నత పాఠశాలల్లో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సి.నరసింహమూర్తిలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

ఇద్దరు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

రొళ్ల: మండలంలోని అలుపనపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎస్.వరప్రసాద్, గుడ్డగుర్కి ప్రాథమికోన్నత పాఠశాలలో గణితశాస్త్రం ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న డీఆర్ తిప్పేస్వామి ఇరువురు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

పెనుకొండ రూరల్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి విద్యాశాఖ అధికారులు గురువారం ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఇందులో గుట్టూరు జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎం బండి నాగార్జునుడు, మావటూరు జెడ్పీ హైస్కూల్ టీచర్ అమరచంద్రబాబు, గొందిపల్లి ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు అమీర్‌వలి, ఇస్తాపురం ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు వై.కేశప్ప ఎంపికైనట్లు ఎంఈఓ సుధాకర్ తెలిపారు.



నాగార్జున



చంద్రబాబు



అమీర్ వలి



కేశప్ప



కే.విశ్వనాథ్



పి.వెంటేశ్వరప్రసాద్



కేఎస్ రమేష్



ఎస్.వరప్రసాద్



డీఆర్ తిప్పేస్వామి

అన్నింటా...అదర గొట్టారు

పావగడ: పట్టణంలోని మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో గురువారం నిర్వహించిన కసబ హోబళి స్థాయి ఉన్నత పాఠశాలల క్రీడా పోటీల్లో స్థానిక వేంకటేశ్వర ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొని విజేతలుగా నిలిచారు. బాలల విభాగం.. పరుగు పందేలలో 100 మీటర్లలో భార్గవ్, 800 మీటర్ల లో దర్శన్, 1500 మీటర్లలో చరణ్ తేజ్ ద్వితీయ స్థానాల్లో రాణించారు. లాంగ్ జంప్ పవన్ కళ్యాణ్ ప్రథమ స్థానం, హై జంప్‌లో దీక్షిత్ ప్రథమ స్థానం, ట్రిపుల్ జంప్‌లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రథమ, పవన్ కళ్యాణ్ తృతీయ స్థానాల్లో విజయం సాధించారు. జల్లికట్టు పోటీల్లో పవన్ ఫస్ట్, చైన్ షాట్ పుట్ లో అనిల్ ప్రథమ, మనోజ్ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. నడక పోటీల్లో దిలీప్ ప్రథమ, వరుణ్ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. బాలికల విభాగంలో..100 మీటర్ల పరుగు పందెంలో శ్రావణి ప్రథమ, అంబిక ద్వితీయ, 200 మీటర్ల పరుగు పందెంలో శ్రావణి ప్రథమ, యుక్తి ద్వితీయ, 400 మీటర్ల పరుగు పందెంలో వైష్ణవి ప్రథమ, హర్షిత ద్వితీయ స్థానాలలో గెలిచారు. విజేతలు ట్రోఫీని అందుకున్నారు.



ట్రోఫీతో విజేతలు

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

లేపాక్షి: హిందూపురం పట్టణంలోని బాలాజీ టాకీస్ పక్కన ఉన్న రోటరీ క్లబ్‌లో పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులచే శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కల్యాణ్‌కుమార్, శ్రీధర్‌గౌడ్ గురవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'గుమ్మనూరు' బెదిరింపులకు భయపడం

పెనుకొండ: గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బెదరింపులకు సీపీఎం, దాని అనుబంధ సంఘాలు ఎక్కడా భయపడవని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హరి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకరరెడ్డిని దూషించడం తగదన్నారు. ఇలాంటి వాటికి ప్రజా సంఘాలు భయపడవని, ఇలాంటివి పునరావృతమైతే తగిన విధంగా స్పందిస్తామని హరి హెచ్చరించారు. నాయకులు సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, సీఐటీయు మండల కార్యదర్శి బాబావలి, మహబూబ్‌బాషా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు కొండా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మనూరు జయరాం క్షమాపణ చెప్పాలి

మడకశిర: రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డిని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ ఫోన్‌లో దుర్భాషలాడాడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్ర పట్టు రైతుల సంఘం అధ్యక్షుడు ధనాపురం వెంకట్రామిరెడ్డి, మడకశిర పట్టు రైతుల సంఘం అధ్యక్షుడు సోమ్‌కుమార్, పట్టు రైతుల సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి, సోమన్న,నవీన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభాకర్‌రెడ్డికి ఎమ్మెల్యే క్షమాపణలు చెప్పకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని పట్టు రైతు సంఘం నాయకులు తెలిపారు.

జాతీయ స్థాయికి ఎదిగాడు



విజయ రాజ సింహ

పావగడ: పట్టణానికి చెందిన ప్రముఖ రాజకీయ నేత సాగడు వెంకటేశ్, గీత దంపతుల కుమారుడు విజయ రాజసింహ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ జావెలిన్ త్రోలో ద్వితీయ స్థానంలో విజయం సాధించి జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యాడు. కర్ణాటకలోని దావణగెరె శామనూరు శివశంకరప్ప యూనివర్సిటీలో ఇటీవల జరిగిన అండర్ 19 క్రీడాకారుల రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొని జావెలిన్‌త్రోలో ద్వితీయ స్థానంలో విజయం సాధించాడు. ఈ నెల 9న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం వారణాసి కాశి లో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నాడు.

డీసీసీబీ అధ్యక్షుడిగా కేఎన్ రాజణ్ణ



రాజణ్ణను అభినందిస్తున్న వెంకటేశ్

పావగడ: తుమకూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతన అధ్యక్షుడిగా మాజీ సహకార శాఖ మంత్రి కేఎన్ రాజణ్ణ ఏడో సారి ఏకగ్రీవంగా ఎన్నికై, రికార్డు సృష్టించాడు. ఎన్నికలు జిల్లా సహకార సంఘం బ్యాంకు కార్యాలయంలో గురువారం జరిగాయి. సహకార బ్యాంకులో 14 మంది ఎన్నికైన డైరెక్టర్లతో పాటు ముగ్గురు నామినీలు కలసి మొత్తం 17 మంది డైరెక్టర్లు ఉన్నారు. ఉపాధ్యక్షుడిగా జీజే రాజణ్ణ సైతం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్థానిక ఎమ్మెల్యే, డీసీసీ బ్యాంకు డైరెక్టర్ వెంకటేశ్, మాజీ మంత్రి వెంకట రమణప్ప, స్థానిక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ సుదేశ్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్లు రాజేశ్, ఏ శంకరరెడ్డి, తుముల్ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి తదితర కాంగ్రెస్ నేతలు హర్షం ప్రకటించారు.

ఎయిడ్స్ మహమ్మారిపై జాగ్రత్తలు తీసుకోవాలి

రొళ్ల: ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ మహమ్మారిపై జాగ్రత్తలు తీసుకోవాలని ఫోర్డు స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ అశ్వత్థనారాయణ, ఐసీటీసీ కౌన్సిలర్ అంజినప్ప తదితరులు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని హొట్టేబెట్ట ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఫోర్డు స్వచ్ఛంద సంస్థ, ఐసీటీసీ కౌన్సిలర్ వారి ఆధ్వర్యంలో సంయుక్తంగా కలిసి హెచ్ఐవీ, ఎయిడ్స్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.